క్లుప్తంగా

వైభవంగా బళ్ల పూజ



మామిడికుదురులో జరిగిన బళ్ల పూజలో పాల్గొన్న రజకులు

మామిడికుదురు: చిత్ర, విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ మామిడికుదురులో ఆదివారం బాల బాలాజీ రజక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బళ్ల పూజ వైభవంగా జరిగింది. గ్రామ దేవత నూకాలమ్మకు ప్రత్యేక పూజలు జరిపి, నైవేద్యాలు చెల్లించారు. రజకులు ఎంతో ఆనందోత్సాహాలతో బళ్ల పూజ జరిపించారు. సంస్థ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి పేట భాస్కరరావు, నగరపు సుబ్రహ్మణ్యం, అధికారపు వీరన్నబాబు, నేదునూరి రాజ్ కుమార్, కొత్తపల్లి దుర్గారావు, పాశర్లపూడి శ్రీరామ్‌సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దుర్గారావు దంపతులు

ఆలమూరు: యర్ర కాలనీలో నిర్మిస్తున్న సత్తెమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త వైట్ల దుర్గారావు రూ.30 వేల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు ఆలయ నిర్మాణం వద్ద వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు సమక్షంలో ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆదివారం ఆ విరాళాన్ని అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం సమీపంలోని చెక్క రూపంలో ఉన్న అమ్మవారికి దుర్గారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవానీ, అనుసూరి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వివాహ ఖర్చులకు ఆర్థిక సాయం



వధువు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదికర సైకిల్ షాప్ సెంటర్ నిర్వాహకుడు కొల్లాబత్తుల కుమార్‌రత్నం కుమార్తె వివాహ ఖర్చులకు సమకూర్చిన రూ.30 వేల ఆర్థికసాయాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆదివారం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన వీరి ఆర్థిక పరిస్థితిని గమనించిన ఆదర్శ ఆంధ్రా యూత్ సంస్థ (కువైట్) రూ.20 వేలు, సంస్థ వ్యవస్థాపకుడు మోకా స్వామి వ్యక్తిగతంగా మరో రూ.పది వేలు సమకూర్చారు. మొత్తం రూ.30 వేలను ఎమ్మెల్యే రాపాక వధువు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే వెంట గెడ్డం అమ్ములు, దొంగ ఏసుబాబు, తాడి సహదేవ్, కొల్లాబత్తుల జార్జి, గునిశెట్టి తాతయ్య, పాస్టర్ మేడిది సిరిల్, కె.ఏ సురత్నం, బీరబాబులు ఉన్నారు.

హజరత్ ఆలీ గంధోత్సవం



గంధోత్సవంలో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లిం ఆరాధ్యుడు ఇమామ్ హజరత్ ఆలీ గంధోత్సవాన్ని ఆదివారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మామిడికుదురులోని పంజా నుంచి గంధాన్ని తీసి, ఊరేగింపుగా నగరం పెద పంజీషాకు తీసుకువెళ్లారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్రసాద వితరణ జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారులతో జెండాలు ఊరేగించి భక్తిని చాటుకున్నారు.

ఎంపీడీఓ నాతి బుజ్జికి సత్కారం

ఆత్రేయపురం: జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎంపీడీఓ నాతిబుజ్జిని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డితో పాటు నాయకులు, అధికారులు బొబ్బర్లంక గ్రామంలో ఆదివారం సన్మానించారు. అభివృద్ధి కార్యక్రమాల అమల్లో భాగంగా, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణంలో జిల్లాలో ఆత్రేయపురం మండలం ముందంజలో ఉండటంతో, ఆమె అత్యుత్తమ సేవలకు అవార్డు లభించింది. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన వృక్షం

అమలాపురం టౌన్: కొంకాపల్లి ఎత్తు రోడ్డులో ప్రధాన రోడ్డుపై ఓ వృక్షం శనివారం రాత్రి కుప్పకూలి విద్యుత్ తీగలపై పడింది. దీంతో తీగలు తెగి రోడ్డు మీద పడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి, అక్కడ అంధకారం అలముకుంది.

పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ప్రతి పల్లెలో అభివృద్ధి బావుటా
- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- రూ.5 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



బొబ్బర్లంకలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



గోపాలపురంలో లబ్ధిదారుకు ఇంటి స్థలం ఇస్తున్న జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు విశేషంగా జరిగాయని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పరిపాలన సాగించారని, అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్ర స్థానంలో నిలిపారని పేర్కొన్నారు. ఆదివారం ఆత్రేయపురం మండలంలో ఆయన పర్యటించి, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. బొబ్బర్లంక గ్రామంలో రూ.79.30 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకే, వెల్నెస్ సెంటర్ల భవనాలు, వెలిచేరు గ్రామంలో రూ.56.80 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకే, వద్దిపర్రు గ్రామంలో రూ.79.30 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకే, నార్కెడ్‌మిల్లి గ్రామంలో రూ.1.95 కోట్లతో నిర్మించిన రోడ్లు, డ్రైన్లు, అంకంపాలెం గ్రామంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాలను ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా రైతులు, మహిళలు, బడుగు, బలహీన, పేద వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కుల, మత వర్గాలకతీతంగా పాటుపడుతోందన్నారు. ప్రజలంతా కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు అందించామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కులమతాలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలనుకోవడాన్ని ప్రజలు గ్రహించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే పనులు చేస్తుండగా, వాటిని చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా అన్ని సంక్షేమ పథకాలు వేగంగా ప్రజల ఇంటి వద్దకే అందిస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు పలు సంక్షేమ పథకాల ద్వారా వేల కోట్ల రూపాయలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసి, ఎన్నికల హామీని అనతికాలంలోనే నెరవేర్చిన ప్రభుత్వంగా ప్రజలు మెప్పు పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

గోపాలపురంలో 700 ఇళ్ల స్థలాల అందజేత

రావులపాలెం: ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అంజేస్తున్నామని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం గోపాలపురం గ్రామంలోని పేదలందరికీ ఇళ్ల లేఔట్ 1, 2, 3ల్లో సుమారు 700 మంది లబ్ధిదారులకు స్థలాలను ఆయన సంప్రదాయబద్ధంగా పసుపుకుంకుమలతో ఆడపడుచులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దె ఇళ్లల్లో కష్టాలు పడుతున్న వారందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సొంతింటి కల నెరవేర్చిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల స్థలాలు అందించడానికి అహర్నిశలు శ్రమిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాలు అందుకున్న ఆడపడుచులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బితి మోహనరావు, చిర్ల రామచంద్రారెడ్డి, సత్రం చైర్మన్ కొపెల్ల మల్లి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గమంతా అభివృద్ధి వెలుగులు

గడిచిన నాలుగున్నరేళ్లలో సుమారు రూ.700 కోట్లతో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేయించినట్టు చిర్ల జగ్గిరెడ్డి వివరించారు. గోపాలపురం గ్రామంలో గతమెన్నడూ లేని విధంగా సుమారు రూ.50 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలోని సచివాలయం–2, రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం–3 నూతన భవనాన్ని ప్రారంభించారు. రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను, అనంతరం రూ.15.74 లక్షలతో నిర్మించిన జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బితి మోహనరావు, చిర్ల రామచంద్రారెడ్డి, నాగమహేశ్వరరెడ్డి, కార్యదర్శి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో మురళి కోలాటం



అంతర్వేదిలో కోలాట భజన బృందంతో అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన హరే శ్రీనివాస కోలాట భజన మండలి ఆధ్వర్యంలో బృందం మురళి కోలాటం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసునిపై ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకుడు పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

దేవస్థానంలో వచ్చే నెల 16 నుంచి 25 వరకూ జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో స్వామికి భక్తులు సమర్పించే తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం, అంతర్వేదిలో దేవస్థానం భూములకు మూడేళ్ల కాలానికి సాగు చేసే కౌలుహక్కుకు సోమవారం ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఏసీ సత్యనారాయణ తెలిపారు.

బాలబాలాజీ స్వామిని దర్శించుకున్న ప్రముఖులు



జ్యుడీషియల్ సభ్యుడు ప్రసాద్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న చైర్మన్ రామకృష్ణ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. చండీగఢ్ జ్యుడీషియల్ సభ్యుడు పీఎస్ఎన్ ప్రసాద్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ (సీఏఓ) పోలీస్ ఆఫీసర్ సి.గోవిందరాజన్ బాల బాలాజీ స్వామివారిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన బాలాజీ స్వామిని దర్శించుకున్న అనంతరం అర్చకుల నుంచి మహదాశీర్వచనం అందుకున్నారు. వారికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ గ్రంధి మాధవి స్వామివారి శేష వస్త్రం అందించారు. అలాగే స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యుడు చిట్టాల సత్తిబాబు, ఉప ప్రధానార్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు, ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

స్వామి వారికి రూ.1.17 లక్షల ఆదాయం

అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి ఆదివారం వివిధ సేవల ద్వారా రూ.1.17 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాద విక్రయం, దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.86,161 ఆదాయం లభించింది. నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.31,103 విరాళాలుగా సమర్పించారు. 2,369 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, 1,584 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

మరోసారి జగనన్నను గెలిపిద్దాం

పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి



సమావేశంలో మాట్లాడుతున్న విప్పర్తి వేణుగోపాలరావు

అయినవిల్లి: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, పేదల పెదవులపై చిరునవ్వులు చూడాలన్నా ప్రతిఒక్కరూ మరోసారి ఓటు వేసి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఉభయ గోదావరి జిల్లాల జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మరలా ఆయనకే ఓటు వేసి పురోగతి దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నడిపిద్దామని చెప్పారు. ఆదివారం సిరిపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ అయినవిల్లి శాఖ కన్వీనర్ కుడుపూడి విద్యాసాగర్ ఆధ్వర్యంలో పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్పర్తి వేణుగోపాలరావు మట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకూ వైఎస్సార్ సీపీ శ్రేణులు పుంజుకోవాలని, పార్టీ వైభవాన్ని ప్రజలకు చాటి చెప్పాలన్నారు. నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకే తనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రరెడ్డి పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతను అప్పగించారన్నారు. ఏదిఏమైనా మరోసారి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఇందుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శక్తివంచన లేకుండా సైనికుల్లా పనిచేయాలన్నారు. 175కు 175 సీట్ల విజయ లక్ష్యం సాధించాలన్నారు. నాయకులను, కార్యకర్తలను పార్టీ ఎన్నటికీ మర్చిపోదని, అందరికీ న్యాయం చేస్తుందన్నారు. అలాగే ఏలూరులో ఫిబ్రవరి ఒకటిన జరిగే.. పెత్తందార్లతో యుద్ధానికి నేను సై, మీరు సిద్ధమా.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు పేరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్ నారాయణ, సిరిపల్లి సర్పంచ్ కుడుపూడి శాంతావతి, సిరిపల్లి ఎంపీటీసీ యడ్ల కిరణ్‌బాబు, నాయకులు కుడుపూడి రామకృష్ణ, బొంతు రాజేంద్రప్రసాద్, పెట్టా జగన్, మద్దింశెట్టి రాంబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం

ఎమ్మెల్యే రాపాక



పాలగుమ్మిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక

రాజోలు: మెరుగైన వైద్య సదుపాయాలను కల్పించి గ్రామీణుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం పాలగుమ్మి గ్రామంలో నూతనంగా నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సెంటర్ నిర్మాణానికి మాజీ సర్పంచ్ కడలి సత్యనారాయణమ్మ, నరసింహశెట్టి దంపతులు, వారి కుమారుడు బంగారు వెంకటేశ్వరరావులు స్థలం విరాళంగా ఇవ్వడంపై వారిని ఎమ్మెల్యే అభినందించారు. సర్పంచ్ అప్పారి లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ఇప్పటికే 104 వాహనం ద్వారా ప్రభుత్వం గ్రామాల్లో ప్రతినెలా వైద్య సేవలకు అన్ని సదుపాయాలు కల్పించిందన్నారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు చక్కటి వైద్యం అందిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల విలువైన వైద్య సేవలు పొందేలా ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్నారన్నారు. ఎంపీటీసీ బత్తుల హేమ, పార్టీ నాయకులు కంచర్ల శేఖర్, అప్పారి సత్యనారాయణ మూర్తి, బత్తుల లక్ష్మణ్, కడియం పూర్ణచంద్రరావు, కంచి వెంకటరమణ, కుంపట్ల చిన్నారి, పెద్దిరాజు, కడలి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే విజయం తథ్యం

విజయవాడ డీసీపీ సత్తిబాబు



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డీసీపీ సత్తిబాబు

పి.గన్నవరం: విద్యార్థులు క్రమశిక్షణతో, సరైన అవగాహనతో చదివితే గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షల్లో విజయం సాధించవచ్చని విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు అన్నారు. మండలంలోని చాకలిపాలెం కృష్ణబాలాజీ కన్వెన్షన్ హాలులో ఆదివారం శ్రీచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ట్రస్టు చైర్‌పర్సన్ మోకా రమాదేవి సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను సత్తిబాబు 120 మంది నిరుద్యోగ, ఉద్యోగార్థులకు అందించారు. రాజోలు జెడ్పీటీసీ మట్టా శైలజ మాట్లాడుతూ డీసీపీ సత్తిబాబు కులమతాలకతీతంగా వేలాది మంది పేద విద్యార్థులకు సాయం అందించి, ఉద్యోగులుగా తీర్చిదిద్దుతున్నారని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మట్టా సత్తిబాబు, నెల్లి దుర్గాప్రసాద్, మోకా సత్యం, నల్లి శ్రీచరణ్, తాడి శేఖర్, ప్రదీప్, గూటం సాయి, దాసరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ దినోత్సవం



కాట్రేనికోనలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎలక్ట్రీషియన్లు

కాట్రేనికోన: థామస్ అల్వా ఎడిషన్ జన్మదినాన్ని పురస్కరించుకుని నవచైతన్య ప్రైవేట్ ఎలక్ట్రికల్ అండ్ రివైండింగ్ వర్క్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఎలక్ట్రీషియన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏపీడీపీసీఎల్ ఏఈ బి.నాగేశ్వరరావు, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్‌లు మాట్లాడుతూ చీకటిని పారదోలి విద్యుత్ వెలుగులు ప్రపంచానికి అందించిన థామస్ అల్వా సేవలు మరువలేనివన్నారు. యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు సంసాని కోటేశ్వరరావు, సంసాని నాగేశ్వరరావు, ఎలక్ట్రీషియన్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కర్రి శ్రీనివాసవర్మ, సభ్యులు కాగిత సత్తిబాబు, నాగేశ్వరరావు, రవికుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకు ఘన సత్కారం



సంజీవరెడ్డిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆలమూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమన్షు శుక్లా చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న ఆలమూరు పంచాయతీ కార్యదర్శి కె.సంజీవరెడ్డిని ఘనంగా సత్కరించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేలపూడి లావణ్య కుమార్ రాజా, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు తదితరులు మాట్లాడారు. సుదీర్ఘ కాలంగా కార్యదర్శి సంజీవరెడ్డి గ్రామస్తులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం అయనకు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని వారు ఆకాంక్షించారు. గ్రామ సచివాలయ, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓ సాలెంరాజుకు సత్కారం

స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ పి.సాలెంరాజుకు ఘన సత్కారం జరిగింది. ఇటీవల అమలాపురంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్న సాలెంరాజును ఎస్టీయూ మండల శాఖ ప్రతినిధులు సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహ పునరావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని పునఃఆవిష్కరించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: వెదిరేశ్వరం గ్రామంలో తీర్చిదిద్దిన రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆదివారం పునరావిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఈ దేశానికి చేసిన మేలును, నిర్మించిన రాజ్యాంగాన్ని, చేసిన త్యాగాలను చిర స్థాయిలా గుర్తుండిపోయేలా విజయవాడలో నిర్మించిన 206 అడుగుల ఆయన విగ్రహం, స్మృతివనమే తార్కాణమన్నారు. మన పిల్లలు ఈ రోజు, ఇలా చదువుకుంటున్నారంటే, తన శాసన సభ సభ్యత్వమైనా అంబేడ్కర్ కృషి ఫలితమేనన్నారు. ఆయన ఆశయాల కోసం అణగారిన వర్గాల పక్షాన ఎల్లప్పుడూ నిలబడతానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు, జి.రమాదేవి, సర్పంచ్ బొక్కా కరుణాకరం, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, కోనాల రాజు, వైవీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శివకోడులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రాజోలు: శివకోడు ఉన్నత పాఠశాలకు చెందిన 1973–74 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువుకునే రోజుల్లో జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు. పూర్వ విద్యార్థులు మాజీ సర్పంచ్ కసుకుర్తి రామకృష్ణ, గాదె వెంకన్న, బిళ్ల కోటేశ్వరరావు, రవీంద్రాచార్యులు, ఎ.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వశిష్ట నదీపాయపై వంతెన నిర్మించండి

కేంద్ర సహాయ మంత్రి స్వామికి లంక ప్రజల వినతి



వైవీ పాలెం వద్ద లంక గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి నారాయణస్వామి

పి.గన్నవరం: పశ్చిమ గోదావరి జిల్లా ఆనగర్లంక, పెదమల్లంక గ్రామాల నుంచి కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం యర్రంశెట్టివారిపాలేనికి వశిష్ట నదీపాయపై వంతెన నిర్మించాలని ఆయా ప్రాంతాల ప్రజలు ఆదివారం కేంద్ర సహాయ మంత్రి అబ్బయ్య నారాయణ స్వామికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పి.గన్నవరం సభకు వెళ్తున్న స్వామిని వైవీపాలెం వద్ద లంక ప్రజలు కలిసి తమ ఇబ్బందులను వివరించారు. తమ గ్రామాలు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో ఉన్నప్పటికీ, పి.గన్నవరం మండలానికి మార్గం ఉందని, వరదల సమయాల్లో రహదారి నీట మునిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు మంత్రికి వివరించారు. గతంలో ఇక్కడ వంతెన నిర్మాణానికి రూ.9.5 కోట్లు మంజూరైనా, టెండర్లు ఖరారు కాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. వంతెన నిర్మించి తమను ఆదుకోవాలని మహిళలు, గ్రామస్తులు కోరారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసి, వంతెన నిర్మించేందుకు కృషి చేస్తానని మంత్రి అన్నారు. వంతెన నిర్మించాల్సిన ప్రాంతాన్ని కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటితో కలిసి స్వామి పరిశీలించారు. లంకల్లో ప్రజల జీవన విధానాన్ని, వారి ఉపాధి కోసం ప్రభుత్వం ఇస్తున్న సి–క్లాస్ లీజు పట్టాలపై ఆర్డీఓ వివరించారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, సీఐ ప్రశాంతకుమార్, నాయకులు ఆకుమర్తి చిన్న మాదిగ, కొల్లి సూర్యారావు, సిర్రా పాపారావు, తవిటికి కృష్ణమూర్తి, సిర్రా శ్రీరామ్, ఆకుమర్తి చిట్టిబాబు, శ్రీను, సాయిబాబు, తవిటికి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కబడ్డీ విజేత బెల్లంపూడి



కబడ్డీ విజేతగా నిలిచిన బెల్లంపూడి జట్టు

పి.గన్నవరం: జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా కబడ్డీ పోటీల్లో పి.గన్నవరం మండలం బెల్లంపూడి గ్రామ సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. సెమీ ఫైనల్‌లో అంబాజీపేట మండలానికి చెందిన జట్టుపై, ఫైనల్‌లో అయినవిల్లి మండలానికి చెందిన జట్టుపై విజయం సాధించి విజేతగా నిలిచింది. దీంతో బెల్లంపూడి జట్టు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. నియోకవర్గ స్థాయిలో విజయం సాధించిన ఈ జట్టుకు ప్రభుత్వం రూ.35 వేలు, ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేయనుంది. ఈ టీమ్‌ను బెల్లంపూడి సర్పంచ్ బండి మహలక్ష్మి, మహాలక్ష్మి ట్రస్టు చైర్మన్ బండి రమేష్ తదితరులు అభినందించారు.

పీఎంపీల సమావేశం

ఉప్పలగుప్తం: సన్నవిల్లి గ్రామంలో గనిశెట్టి లక్ష్మణరావు స్వగృహంలో పీఎంపీ, ఆర్ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవ సమావేశం శనివారం నిర్వహించారు. సంఘ నిర్ణయాలకు లోబడి ఉండాలని, ప్రజలకు సక్రమమైన వైద్యం అందించాలని తీర్మానించారు. సభ్యుల కుటుంబంలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన పిల్లలను, వృత్తి రీత్యా సీనియర్ వైద్యులను దుశ్శాలువాలతో సత్కరించారు.